ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లా భారీ వర్షాలు పడే సూచనలున్నాయని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల సమయంలో ప్రజలు వాగులు, వంతెనలు దాటే ప్రయత్నాలు చేయవద్దన్నారు. రైతులు మొక్కజొన్న పంట కోతను వాయిదా వేసుకోవాలని, మట్టి మిద్దెల కింద నివాసం ఉండవద్దని సూచించారు. ప్రజలు భద్రతా చర్యలు తప్పకుండా పాటించాలన్నారు.

టీజీ ప్రధాన కాలువకు గండి

- 84 కి.మీ వద్ద కుంగిన ప్రధాన కాలువ కట్ట
- గండిపడ్డ చోట నుంచి వృథాగా పోతున్న నీరు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- సహాయక చర్యలు చేపట్టాలంటూ ఎమ్మెల్యే ఆదేశం



డి. వనిపెంట గ్రామ సమీపంలో గండిపడ్డ టీజీపీ ప్రధాన కాలువ

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో చాగలమర్రి మండలంలో డి. వనిపెంట గ్రామ సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాలువ 84 కి.మీ సమీపంలో ప్రధాన కాలువ కుంగి శనివారం సాయంత్రం గండిపడింది. నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న టీజీపీ కాలువ ఒక్కసారిగా కుంగి గండిపడింది. గండిపడ్డ చోట నుంచి కాలువ నీరు దిగువ ప్రాంతానికి వెళ్తోంది. విషయం తెలుసుకున్న అధికార యంత్రాంగం టీజీపీ కాలువ వద్దకు వెళ్లారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ సురేష్, ఎంపీడీవో తాహిర్‌హుసేన్, తెలుగుగంగ, మైనర్ ఇరిగేషన్ ఏఈలు వినయ్, రాంప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గండిపడ్డ ప్రదేశాన్ని చూసి ప్రమాద తీవ్రతను అంచనా వేశారు. గండిపడ్డ ప్రదేశం నుంచి దిగువకు వెళ్తున్న నీటి వల్ల ప్రధానంగా ముంపుకు గురయ్యే తోడెండ్లపల్లె గ్రామానికి వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు. టీజీపీకి గండిపడటంతో నీరు పంట పొలాల్లో ప్రవహించి తోడేండ్లపల్లె గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేశారు. టీజీపీ ఏఈ వినయ్ తెలుగుగంగ ఎస్ఈతో చర్చించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్‌తో మాట్లాడి వారి సూచనల మేరకు సహాయక చర్యలు చేపడుతున్నామని వారు పేర్కొన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పందించి టీజీపీకి గండిపడ్డ ప్రదేశంలో తాత్కాలిక చర్యలు చేపట్టి ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులకు, టీడీపీ నాయకులకు ఆదేశించారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

నీటి నిల్వ సామర్థ్యం 191 టీఎంసీలు

శ్రీశైలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయానికి వరద కొనసాగుతోంది. శనివారం జూరాల ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 22,680 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 49,228 క్యూసెక్కుల నీరు విడుదలైంది. సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి 40,964 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 26,792 క్యూసెక్కులు, ఎడమగట్టు ద్వారా 35,315, మొత్తంగా 62,107 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను 880.50 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలకుగాను 191.21 టీఎంసీలుగా నమోదైంది.

కాసుల కక్కుర్తి..!

ప్రైవేటు ట్రావెల్స్ అంటేనే ఆకర్షణీయంగా కనపడే రంగురంగుల బస్సులు.. వేగంగా దూసుకుపోయే తత్వం.. గంటల్లో గమ్యస్థానాలకు చేరవేస్తాయనే భ్రమ. ఇదే సగటు ప్రయాణికుడిలో మెదిలే ఆలోచన. భద్రత, నిబంధనల గురించి ప్రజలు ఏరోజైనా ఆలోచించారా? తమకెందుకు అనే ధోరణిలో ఉండిపోయారు. ఇదే ట్రావెల్స్ నిర్వాహకులకు ఆదాయ వనరుగా మారింది. నిబంధనలకు తూట్లు పొడిచి ప్రయాణికులతో చెలగాటమాడుతున్నారు. అనుభవం లేని డ్రైవర్లను నియమిస్తున్నారు. ఇందుకు నిలువెత్తు నిదర్శనమే శుక్రవారం కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో జరిగిన దుర్ఘటన. అధికారులు నిర్లక్ష్యం వీడి నిరంతరం తనిఖీలు చేపట్టి ఉంటే ఇలాంటి ఘటనలు జరిగేవి కావు. ఏదిఏమైనా 19మంది సజీవ దహనమైన ఘటన తర్వాత అధికారుల్లో చలనం వచ్చింది. తనిఖీలు ప్రారంభించారు.. జరిమానాలు విధించారు.



- నిబంధనలకు తూట్లు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- అనుభవం లేని డ్రైవర్లతో ప్రయాణం
- ర్యాష్ డ్రైవింగ్.. అతివేగం
- తనిఖీలు అంతంత మాత్రం
- భయాందోళనలో జనం
- ప్రైవేటు ట్రావెల్స్ ఇష్టారాజ్యం

గుట్టు రట్టు..

రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు శుక్రవారం రాత్రి జిల్లాల వారీగా ఆకస్మిక తనిఖీ చేయడంతో నిబంధనలు అతిక్రమించి నడిపే వాహనాలు గుట్టు రట్టు అయ్యింది. ఒక్కరోజులోనే 289 కేసులు నమోదుచేసి 18వాహనాలు సీజ్ చేయడంతో పాటు సుమారు రూ.7.08లక్షలు జరిమానాలు విధించారు. ఇదే క్రమంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 16 కేసులు నమోదు చేసి సుమారు రూ. 3లక్షలు జరిమానాలు విధించారు. ఈ కేసులే ప్రైవేటు ట్రావెల్స్ దందాకు అద్దం పడుతోంది.

శుక్రవారం ఒక్కరోజే ప్రైవేటు బస్సులపై ..

- నంద్యాల జిల్లాలో నమోదు చేసిన కేసులు : 4
- పట్టుబడిన వాహనాలపై జరిమానాలు : రూ. 51,200
- కర్నూలు జిల్లాలో నమోదైన కేసులు : 12
- పట్టుబడిన వాహనాలపై జరిమానాలు : రూ.2.42 లక్షలు

నంద్యాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ దృష్టి అంతా కాసులపైనే ఉంది. కాసుల కోసం కక్కుర్తి పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. శుక్రవారం కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో 20 మందికి సజీవ దహనమైన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలవరం రేపింది. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళన నెలకొంది. పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, ప్రజా ప్రతినిధులు సైతం సీరియస్ అయ్యారు. ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులతో పాటు, రవాణా శాఖాధికారులపై సైతం విమర్శలు జోరందుకున్నాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు ఆయా జిల్లాల వారీగా ప్రైవేట్ ట్రావెల్స్‌పై ఆకస్మిక తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఏదైన ఘటన జరిగితే తప్ప మిగతా సమయాల్లో అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తారన్న ఆరోపణలు లేకపోలేదు. ఏది ఏమైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రావెల్స్‌పై కొరడా ఝళిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





శుక్రవారం రాత్రి తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)

ఇష్టారాజ్యంగా..

నంద్యాల జిల్లా పరంగా ఒకే సంస్థకు చెందిన 16 ప్రైవేటు వేట్ బస్సులు హైదారాబాదు, బెంగళూరు, విజయవాడకు నిత్యం తిరుగుతున్నాయి. ఇదేతరహాలో అనంతపురం, కర్నూలు, తిరుపతి, కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో సుమారు 20 ట్రావెల్స్‌కు చెందిన 40 బస్సులు ఇతర ప్రాంతాల నుంచి నంద్యాల మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో చాలా వరకు నిబంధనలు పాటించడం లేదని తెలుస్తోంది. రవాణాశాఖ అధికారులు సైతం ఆశించిన స్థాయిలో తనిఖీలు చేయకపోవడంతో సదరు ట్రావెల్స్ సైతం ఇష్టారాజ్యంగా తిప్పుతూ క్యాష్ చేసుకుంటున్నారు.

డ్రైవర్ల నియామకంలో..

డ్రైవర్లను నియమించడంలోనూ ట్రావెల్స్ నిర్వాహకులు వక్రబుద్ధి చూపడం పలు విమర్శలకు తావిస్తోంది. తక్కువ జీతానికి వస్తారు కదా? అని ఆశపడి అనుభవం లేని డ్రైవర్లు ఎంపిక చేసుకోవడం. ఎవరైనా డ్రైవర్‌ను తీసుకోవాలంటే 15 సంవత్సరాలు అనుభవం ఉండాలి. ఈ నిబంధనలు చాలా వాటిలో అమలుకాలేదని తెలుస్తోంది. కొందరైతే ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన బస్సులను ఇక్కడ తిప్పి రాష్ట్రానికి పన్నులు సైతం సక్రమంగా చెల్లించడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. కొందరు డ్రైవర్లు సైతం తప్పుడు ధృవపత్రాలు చూపించి డ్రైవర్లుగా చేరుతున్నారనే విమర్శలు లేకపోలేదు.

మిగతా 8వ పేజీలో

దద్దనాలకు పెరిగిన వరద



దద్దనాల ప్రాజెక్టుకు చేరుతున్న వరద నీరు

బనగానపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దద్దనాల ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగింది. రెండు రోజులుగా ప్రాజెక్టు పైభాగంలో కురుస్తున్న వర్షాలకు వరద పెరిగినట్లు ప్రాజెక్టు అధికారి రామ్మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. మద్దిలేటయ్య స్వామి ఆలయ పరిసరాల్లో, మునిమడుగు, మంగంపేట, జలదుర్గం గ్రామాల్లో భారీగా వర్షాలు పడుతున్నాయి. దీంతో దద్దనాల ప్రాజెక్టుకు తొలిసారి వరద వచ్చింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హయాంలో రూ.21 కోట్ల వ్యయంతో దద్దనాల ఎత్తిపోతల ద్వారా ఎస్సార్బీసీ కాల్వనుంచి రెండు మోటార్లు ద్వారా నిత్యం దద్దనాలకు నీరు పంపింగ్ చేస్తున్నారు. ఈ పంపింగ్‌తోనే దద్దనాల ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంటోంది. ప్రాజెక్టు పైభాగంలో సరిగా వర్షాలు కురవకున్నా 9 అడుగుల వరకు నీరు ఉండేది. దద్దనాల ప్రాజెక్టు నీటి సామర్థ్యం 25 అడుగులు కాగా ప్రస్తుతం 14 అడుగులకు నీరు చేరింది. ఇంకా 11 అడుగులకు చేరితే దద్దనాల ప్రాజెక్టు నిండే అవకాశాలున్నాయి. పడమటి పల్లెల్లో బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. రబీ సీజన్‌లో రైతులకు నీటి కష్టాలు తప్పినట్లే. ప్రాజెక్టుకు తొలిసారి వరదనీరు చేరడంతో పడమటి పల్లెల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి ప్రమాదాలు ఏటేటా పెరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 85 కిలోమీటర్లకు పైగా ఉన్న హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి మీద నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఒకరు ఇద్దరు మరణించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. శుక్రవారం కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో బైక్‌ను తోసుకుపోయి మంటల్లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు కాలిపోయిన ఘటనలో 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాల తీరును పరిశీలిస్తే గుండెలు పగిలే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ప్రమాదాల రహదారులు



- జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- రక్తసిక్తమవుతున్న జాతీయ రహదారి
- కనీస భద్రతా చర్యలు పాటించకపోవడమే కారణమా..?
- అనుభవం లేని డ్రైవర్లతో ట్రావెల్ బస్సులు నడిపిస్తున్న యాజమాన్యం

కర్నూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులు, స్టేట్ హైవే రహదారుల్లో ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు, పోలీసులు హడావుడి చేస్తున్నారు. తరువాత షరా మామూలే అని వదిలేస్తున్నారు. ఏటేటా భద్రతా వారోత్సవాలు నిర్వహించినా ప్రమాదాలు తగ్గడం లేదు. పైగా పెరుగుతూనే ఉన్నాయి. రవాణా శాఖ అధికారుల్లో అలసత్వం, సిబ్బంది కొరత, పోలీసులు శాంతి భద్రత పర్యవేక్షణకే పరిమితం కావడం వంటి సమస్యలు ఉన్నాయి. ప్రమాదాల నివారణ ప్రకటనలకే పరిమితమైంది. దీనికి తోడు అనుభవం లేని డ్రైవర్ల వల్ల ప్రజల ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తున్నది. దేశవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లే 95 శాతం ప్రమాదాలు జరిగితే, డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల 75 శాతం, మరో 25 శాతం రోడ్లు, వాహనాల మరమ్మతుల కారణంగా జరుగుతున్నట్లు సమాచారం. జిల్లాలో 600-800 మందికి పైగా మృత్యువాత పడితే, 3 వేల మందికిపైగా గాయాల పాలవుతున్నారు.



2019 మే 11న వెల్దుర్తి సమీపంలో జరిగిన ప్రమాదం

జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాలు కొన్ని

- ఈ ఏడాది మే 20న ప్యాపిలి సమీపంలో జాతీయ రహదారి-44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు
- 2019 మే 11న వెల్దుర్తి సమీపంలో చెక్‌పోస్టు వద్ద తుఫాన్ జీపును ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో 16 మంది మృతి చెందారు. మృతులంతా తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లె మండలం రామాపురం గ్రామానికి చెందినవారు.
- 2021 ఫిబ్రవరి 15న మాదార్‌పురం గ్రామం వద్ద మినీ బస్‌ను లారీ ఢీకొన్న ఘటనలో 14 మంది మృతి చెందారు. వెల్దుర్తి సర్కిల్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకరు ఇద్దరు మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి.
- 2019-21 మధ్య కాలంలో వెల్దుర్తి-మాదార్‌పురం మధ్య పలు ప్రమాదాలు జరిగాయి. మాదార్‌పురం సమీపంలో ఓ వాహనం బోల్తాపడి పలువురు మృత్యువాత పడ్డారు.
- కర్నూలు-చిత్తూరు వయా నంద్యాల, ఆళ్లగడ్డ జాతీయ రహదారిలో ఆళ్లగడ్డ, చాగలమర్రి మధ్య నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలుస్తోంది.

ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు

హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి-44పై కర్నూలు నగరం సంతోష్ నగర్, చిన్నటేకూరు, ఉల్లిందకొండ క్రాస్, దత్తాత్రేయస్వామి ఆలయం సమీపంలో, వెల్దుర్తి సర్కిల్ ఆంజనేయస్వామి విగ్రహం, మదార్‌పురం, ప్యాపిలి క్రాస్ రోడ్డు.. వంటి ప్రాంతాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. తాజాగా కర్నూలు నగర శివారులో వెంకన్నబావి ప్రాంతం కూడా ప్రమాదకరంగా మారింది.

పోలీసుల దర్యాప్తు వేగవంతం

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనపై పోలీసులు వేగవంతమైన దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. శనివారం దర్యాప్తులో కీలక ఆధారాలను సేకరించారు. బైక్ నడిపిన శివశంకర్ గురించి ఆరా తీశారు. ఆ యువకుడు ఎక్కడి నుంచి బయల్దేరాడు? ఎక్కడకు వెళ్తున్నాడు? వంటి విషయాలపై క్షుణ్ణంగా ఆరా తీశారు. తుగ్గలి మండలం రాంపల్లె గ్రామానికి చెందిన ఎర్రిస్వామిని డోన్‌లో వదిలిపెట్టేందుకు శివశంకర్ అర్ధరాత్రి బయల్దేరాడు. వీరు పల్సర్ బైక్‌కు చిన్నటేకూరు వద్ద ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టించుకున్నారు. అక్కడ బైక్‌పై విన్యాసం చేశారు. వర్షం పడుతుంటంతో వీరి బైక్ హరంగార్ డాబా దాటిన తర్వాత ప్రమాద స్థలానికి 200 మీటర్ల దూరంలో అదుపు తప్పింది. కుడి వైపు ఉన్న డీవైడర్‌ను ఢీకొట్టి ఇద్దరు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో శివశంకర్ మృతి చెందగా.. ఎర్రిస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. శివశంకర్ ఉలుకు పలుకు లేకుండా పడి రోడ్డుపై ఉండటంతో అతన్ని పక్కకు లాగాడు.

మిగతా 7వ పేజీలో

అధికారం లేని పదవులు ఎందుకు..?

- వైసీపీ పాలనలో మార్కెట్ కమిటీలన్నీ నిర్వీర్యం
- ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీల చైర్మన్లు



సమావేశమైన ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీల చైర్మన్లు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అధికారం లేని పదవులు తమకు ఎందుకని, గత వైసీపీ ప్రభుత్వంలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు ఉన్న అధికారాలన్నీ తొలగించారని ఉమ్మడి జిల్లాకు చెందిన మార్కెట్ కమిటీల చైర్మన్లు అన్నారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల చైర్మన్లు కర్నూలు మార్కెట్ యార్డులో సమావేశమై మాట్లాడారు. తమకు గతంలో టీడీపీ హయాంలో కొనసాగించిన అధికారాలు ఇవ్వాలని, నిర్వీర్యమైన మార్కెట్ కమిటీ యార్డుల పునరుజ్జీవనం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మొర పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు ఇవ్వాల్సిన అధికారాలు, రైతులకు కల్పించాల్సిన ప్రయోజనాలు, వసతుల గురించి సమావేశంలో చర్చించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత లింక్ రోడ్లపై మార్కెట్ కమిటీల పాలక మండలికి అధికారాలు కల్పించాలని చైర్మన్లు రైతులకు, ప్రజలకు కూటమి ప్రభుత్వంలో రైతుల కోసం అమలు చేస్తున్న ప్రయోజనాలు, పథకాలు, కార్యక్రమాల గురించి అందరికీ తెలియాలంటే మార్కెట్ కమిటీల పాలకవర్గాల పదవీ కాలం కేవలం ఒక సంవత్సరంతో సరిపుచ్చకుండా మూడు సంవత్సరాలకు పొడిగించాలని ముఖ్యమంత్రికి పంపిన వినతి పత్రంలో పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు చెక్‌పవర్ ఇచ్చారనీ, వైసీపీ పాలనలో ఆ అధికారాన్ని రద్దు చేయడం వల్ల కేవలం చైర్మన్లు అలంకార ప్రాయంగా తయారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు నెలకు రూ.30వేల వేతనం అందిస్తున్నారని, అదే మొత్తాన్ని ఏపీలో కూడా అందించాలని ప్రముఖ దేవాలయాల్లో ప్రొటోకాల్ కల్పించి గౌరవాన్ని అందించాలని మొర పెట్టుకున్నారు. సమావేశంలో కర్నూలు మార్కెట్ కమిటటీ చైర్‌పర్సన్ గోల్కొండ అజ్మీత్‌బీ, పాణ్యం మార్కెట్ చైర్‌పర్సన్ గీతా, సుజాతమ్మ, హరిబాబు, నబీ రసూల్, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

అదే వాన.. తగ్గని వరద



బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

- ఉధృతంగా కుందూ, వక్కిలేరు
- కుళ్లిన మొక్కజొన్న, మినుము, బెండ
- స్తంభించిన రాకపోకలు
- పట్టించుకోని వ్యవసాయశాఖ

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలోని వాయుగుండ ప్రభావంతో వర్షాలు ఆగకుండా కురుస్తున్నాయి. చాగలమర్రి మండలంలో శనివారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. 14.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కుందూ, వక్కిలేరు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షంతో రైతులు రహదారిపై ఆరబోసిన మొక్కజొన్న మళ్లీ తడిసి మొలకలు వచ్చాయి. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. నేలంపాడు, గొట్లూరు, రాంపల్లె తదితర గ్రామాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయి. పంట పొలాల్లో ప్రవహించిన వరద నీరు తగ్గకపోవడంతో మొక్కజొన్న, మినుము, బెండ, జూట్, ఉల్లిగడ్డలు కుళ్లిపోయాయి. ఈ వర్షాలకు మండలంలోని నేలంపాడు గ్రామంలో 2 మట్టిమిద్దెలు కుప్పకూలాయి.

ప్యాపిలిని ముంచెత్తిన వర్షం

పొంగి పొర్లిన వాగులు, వంకలు

ప్యాపిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్యాపిలి మండలంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మాధవరం, అలేబాదు, మునిమడుగు, రాచెర్ల, గార్లదిన్నె గ్రామాల్లో వర్షం ముంచెత్తింది. గార్లదిన్నె గ్రామంలో భారీ వర్షానికి వాగు ఉప్పొంగడంతో మునిమడుగుకు వెళ్లే రహదారిపై మోకాళ్ల లోతు వరకు నీరు ప్రవహించింది. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకలు రెండు గంటల పాటు నిలిచిపోయాయి. వర్షానికి రాచెర్ల గ్రామంలో వందలాది ఎకరాల్లోని సజ్జ పంట తడిసిముద్దయింది.



ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామం వద్ద రోడ్డుపై ఉగ్రరూపం దాల్చిన నీటి ప్రవాహం

ఉమ్మడి జిల్లాకు రూ.2 కోట్లు

- తక్షణ సహాయ చర్యలకు నిధులు విడుదల

నంద్యాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.14కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే నిధులను డ్రా చేసి అవసరమైన ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, తాగునీరు, వైద్యం తదితర సంరక్షణ చర్యలు చేపట్టాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాలకు రూ.కోటి చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.

కోవెలకుంట్లలో భారీ వర్షం



భీమునిపాడు ఎస్సీ కాలనీలో నీట మునిగిన ఇల్లు

కోవెలకుంట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల మండలంలో శుక్రవారం రాత్రి 76.6 మిమీల వర్షం కురిసింది. భీమునిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలు జలమయమయ్యాయి. గుళ్లదుర్తి గ్రామంలో వంద ఎకరాల్లో వరి పైరు నీట మునిగింది. పొట్టిపాడు వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారిలో ఊరి ముందు ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని అమడాల, బిజినవేముల, గోవిందిన్నె, చిన్నకొప్పెర్ల, వల్లంపాడు, లింగాల తదితర గ్రామాల మీదుగా ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కోవెలకుంట్ల నుండి వల్లంపాడు, లింగాల మీదుగా నంద్యాలకు వెళ్లే ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి.

అన్నదాతలకు అపార నష్టం

కొలిమిగుండ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చింది. భారీ వర్షాల కారణంగా కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. ప్రధానంగా మండలంలోని కల్వటాల, నందిపాడు, కొలిమిగుండ్ల, బెలుంశింగవరం, తిమ్మనాయినిపేట, కోటపాడు తదితర గ్రామాల్లో నూర్పిడి చేసిన మొక్కజొన్న వర్షంలో తడిచిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా రైతులు 1,300 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా, సుమారు 500 ఎకరాల్లో సాగు చేసిన పంటను నూర్పిడి చేశారు. భారీ వర్షాలతో నూర్పిడి చేసిన మొక్కజొన్న దిగుబడి పూర్తిగా నీటిలో తడిచిపోయింది. నాలుగు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో కప్పి ఉంచిన పట్టలకిందే మొక్కజొన్న మొలకెత్తే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొలకెత్తిన మొక్కజొన్నను కొనడానికి ఎవరూ ముందుకు రారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు 25 క్వింటాళ్లకు పైబడి దిగుబడి వచ్చిందనుకున్న రైతులకు భారీ వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. మరోవైపు కంది, మినుము, అరకొరగా సాగుచేసిన పప్పు శనగ పంటల్లో నీరు చేరడంతో పంటలు కుళ్లిపోయో పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు.



బెలుంశింగవరం వద్ద తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

శ్రీబాగ్‌పై తేల్చుకుందాం

- 16న కర్నూలులో సభను విజయవంతం చేయండి
- రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి



పత్రాలను ఆవిష్కరిస్తున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా పాలకుల వివక్షత వల్ల తీవ్ర అన్యాయానికి గురవుతున్న రాయలసీమ అభివృద్ధికి శ్రీబాగ్ ఒప్పందంపై తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని రాయల్ కేఫ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రాయలసీమ హక్కుల సాధన, అభివృద్ధి చర్చావేదిక సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఈ విషయంపై నవంబరు 16న కర్నూలు పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సమితి సభ్యులు రామాంజనేయులు, ఖాసీం, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పాత రైల్వే వంతెన గోడను ఢీ కొట్టిన లారీ

- ప్రమాదంలో డ్రైవర్ మృతి
- నల్లమలలో ట్రాఫిక్‌కు అంతరాయం

మహానంది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న లోడ్‌తో రాజమండ్రికి వెళ్తున్న లారీ శనివారం ఉదయం నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిలోని పాత రైల్వే వంతెన గోడను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ బాల ఉసేని అక్కడిక్కడే మృతి చెందాడు. క్లీనర్ చిన్నయ్యకు స్వల్పంగా గాయాలయ్యాయి. నల్లమలలోని దిగువమెట్ట సమీపంలో ఉన్న పాత రైల్వే వంతెనకు ఉన్న గోడను ప్రమాదవశాత్తు లారీ ఢీ కొట్టి రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో ఇరువైపులా వాహనాలు రెండు కిలో మీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలను క్రమబద్ధీకరించారు. నల్లమలలో రెండు గంటల పైగానే వాహనాలు నిలిచి పోవడంతో అటువైపు వెళ్ళే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

చిన్నటేకూరు ఘటన కలచివేసింది

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కర్నూలు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జాతీయ రహదారిపై జరిగిన బస్సు ప్రమాద ఘటన కలచివేసిందని, బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో ప్రైవేట్ బస్సు అగ్నికి ఆహుతై 19 మంది సజీవ దహనం అయ్యారు. ఈ క్రమంలో ఆయన శనివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. బస్సు ప్రమాదం జరిగిన రోజు తాను సంఘటనా స్థలంలో వెళ్లానని, ఆ ప్రాంతం భీతావహంగా మారిందన్నారు. బైక్ నడిపిన యువకుడితో పాటు మొత్తం 20 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. డీఎన్‌ఏ రిపోర్టు రాగానే కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించేలా ఏర్పాట్లు చేశామన్నారు.

బస్సు ప్రమాద బాధితులకు న్యాయ సహాయం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ బస్సు ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోవడమే కాక.. పలువురు క్షతగాత్రులయ్యారని, వారికి ఉచిత న్యాయ సహాయం అందించడానికి న్యాయ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక న్యాయ సేవా సదన్ భవనంలో ఈ మేరకు ఆయన న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. బాదితులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గానీ, టోల్ ఫ్రీ నెంబర్‌ను గానీ 15100కు గానీ ఫోన్ చేసి వారి సమస్యలను తెలుపుకోవచ్చని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

నంద్యాల టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన నంద్యాల పట్టణ శివారులో శనివారం చోటు చేసుకున్నది. ట్రాఫిక్ పోలీసుల వివరాల ప్రకారం.. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన భారతి(31) భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై నంద్యాల వస్తుండగా కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన భారతిని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందారు. భర్త రవికుమార్‌కు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఘటన



పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ఆదోని రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం ఇస్వీ బ్రిడ్జి సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలాల్లో దూసుకెళ్లింది. శనివారం ఆర్టీసి డిపో నుంచి విద్యార్థుల కోసం బస్సు మాధవరానికి బయల్దేరింది. ఇస్వీ బ్రిడ్జి వద్ద రాగానే ఎదురుగా వేగంగా దిచక్ర వాహనదారుడు బస్సు మీదకు రావడంతో దానిని తప్పించబోయే క్రమంలో బస్సు ఒక్కసారిగా పొలాల్లోకి దూసుకెళ్లి ఒరిగిపోయింది. అయితే ఈ సంఘటన స్థలంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ రాజు, కండెక్టర్‌కు సురక్షితంగా బయటపడ్డారు. ఇస్వీ పోలీసులు విచారణ చేపట్టారు.

నీటి కుంటలో పడి యువకుడు మృతి

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన యువకుడు దూదెకుల ధర్మతేజ (15) ప్రమాదవశాత్తు నీటి కుంటలో జారిపడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన బాలదస్తగిరి, సిద్దేశ్వరిలకు ముగ్గురు సంతానం. మూడో కుమారుడైన ధర్మతేజ గ్రామ పొలిమేరలో పశువులను మేపుకునేందుకు వెళ్లాడు. అక్కడ తోటి స్నేహితులతో ఆడుకుంటూ సమీపంలో ఉన్న నీటి కుంటలో కాలుజారి పడిపోయాడు. అక్కడే ఉన్న స్నేహితులు ఇంటికి వెళ్లి వారి కుటుంబీకులకు తెలపడంతో స్థానికులు, కుటుంబీకులు కలిసి నీటి కుంట వద్దకు వెళ్లి ధర్మతేజను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం చాగలమర్రి కేరళ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్, పోలీసులు వైద్యశాలకు చేరుకొని యువకుడి మృతి విషయం గురించి కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సుకు అనుమతులు ఉన్నాయి

- రాయ్‌ఘడ్ ఆర్‌టీఏకు అధికారుల లేఖ



కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి కారణమైన బస్సుకు అన్ని అనుమతులన్నీ ఉన్నాయి. ఒడిషా రాష్ట్రం రాయ్‌ఘడ్ జిల్లా చెందిన వేమూరి కావేరి ట్రావెల్స్ అనే బస్సును వేమూరి వినోద్‌కుమార్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. ఈ బస్సుకు 2018 ఆగస్టు 8వ తేదీన రిజిస్ట్రేషన్ జరిగింది. మొదట ఈబస్సు తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ ఆర్‌టీఏ పరిధిలో (టీఎస్-08యుఎఫ్2342) అను నెంబరుతో రిజిస్ట్రేషన్ అయింది. ఆతర్వాత ఈబస్సుకు 2023 మార్చి 31న ఎన్‌వోసీ ఇచ్చారు. ఈబస్సు ఉత్తరాం చల్ (డామన్ డయ్యూ) దాద్రా నగర్ హవేలీ అనే కేంద్ర పాలిత రాష్ట్రానికి మైగ్రేషన్ (రిజిస్ట్రేషన్ నెంబర్. డీడీ01ఎన్9490) అయింది. ఆ తర్వాత 2025 ఏప్రిల్ 29న ఒడిషా రాష్ట్రం రాయ్‌ఘడ్ ఆర్‌టీఏ రిజిస్ట్రేషన్‌కు మైగ్రేషన్ అయింది. ప్రస్తుతం వేమూరి కావేరి ట్రావెల్స్ మీద బస్సు తిరుగుతుంది. మే 1, 2025న ఈ బస్సుకు పర్మిట్ తీసుకున్నారు. 2030వరకు పర్మిట్ అనుమతులున్నాయి. 2026 ఏప్రిల్ 20 వరకు ఇన్సూరెన్స్, 2027 మార్చి 31వరకు ఫిట్‌నెస్ అనుమతి ఉంది. 2026 మార్చి 31వరకు కూడా ట్యాక్స్ కట్టేశా రు. బస్సు కెపాసిటీ- 43 (స్లీపర్). ఈ బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు.

ఒక చిన్న నిర్లక్ష్యమే..

బస్సుకు ఎన్ని అనుమతులున్నా.. అనుభవం ఉన్న డ్రైవర్లున్నా.. ఒక చిన్న నిర్లక్ష్యం 19 మంది ప్రాణాలు బలికొంది. బైక్‌ను ఢీకొన్న తర్వాత సుమారు 170 మీటర్లమేర (500 అడుగులు) లాక్కెళ్లింది. ఈ 500 మీటర్లలో డ్రైవర్ బ్రేక్ వేసినా కూడా బస్సు ఆగేది. బస్సు ఆపి పరిశీలిస్తే ప్రమాదం జరిగి ఉండేది కాదు. మరో వైపు మంటలు ఆర్పే ప్రయత్నం చేయకుండా ప్రయాణికులను అప్రమత్తం చేసి ఉంటే ఈ ప్రమాదం తప్పి ఉండేదని పలువురి వాదనలు వినిపిస్తున్నాయి.

అధికారికంగా అనుమతులు తీసుకున్నారా?

2018లో బస్సు రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత అది 53సీటర్ కెపాసిటీతో చాసిస్ రూపొందించుకుని అనుమతులు తీసుకుంది. ఆ తర్వాత డామన్ డయ్‌లో రిజిస్ట్రేషన్ జరిగింది. అక్కడి నుంచి రాయ్‌ఘడ్ ఆర్‌టీఏకు మైగ్రేషన్ కావడం ఆ తర్వాత బస్సు రూపం మారింది. 43సీపర్‌గా మారి అనుమతులు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ అనుమతులు ఎలా ఇచ్చారు? అధికారికంగా అనుమతులు తీసుకున్నారా? ఆ 43 సీపర్‌కే పన్నులు చెల్లిస్తున్నారనే విషయాలపై ఆర్‌టీఏ అధికారులకు రవాణ అధికారులు లేఖ రాసినట్లు తెలిసింది.

ట్రావెల్ బస్సులపై ఆర్‌టీఏ దాడులు

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన బస్సు ప్రమాదం దృష్ట్యా రవాణా శాఖ అధికారులు ముమ్మరంగా దాడులు చేశారు. కర్నూలు డీటీసీ శాంతకుమారి ఆధ్వర్యంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు శుక్రవారం రాత్రి పలు చోట్ల తనిఖీలు చేశారు. మొత్తం 12 కేసులు నమోదు చేశారు. వీటిలో ఎలాంటి రికార్డులు లేకుండా వెళ్తున్న 2 బస్సులను అగ్నిమాపక సహాయక పరికరాలు లేకుండా ఉన్న 7 బస్సులు, ఎమర్జెన్సీ అలారం లేకుండా ఉన్న బస్సుపై ఒక కేసు నమోదు చేశారు. అలాగే మరో బస్సుకు ఎమర్జెన్సీ డోర్ లేకపోవడాన్ని గుర్తించారు. మరో బస్సు ఎలాంటి పర్మిట్ లేకుండానే ట్రావెల్స్ చేస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించారు. అలాగే వర్షం పడితే తుడిచే విండ్ సీల్డ్ లేకుండా ఉన్న రెండు బస్సులను గుర్తించి జరిమానా వేశారు. మొత్తం రూ.2.48 లక్షలు జరిమానా విధించినట్లు డీటీసీ వెల్లడించారు.

ఆదోనిలో పట్టపగలే భారీ చోరీ

- 24 తులాల బంగారం, రూ.1.20 లక్షల అపహరణ



బీరువాను ఓపెన్ చేసి బంగారు నగలను దొంగలించిన దుండగులు

ఆదోని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఒక ఇంట్లోకి చొరబడి సుమారు 24 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.20 లక్షలు నగదును అపహరించారు. వివరాలివీ.. ఆదోని పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఆంజనేయులు పని నిమిత్తం భార్యతో కలిసి శనివారం పెద్దతుంబళం గ్రామానికి వెళ్లారు. ఎవరూ లేకపోవడంతో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న బీరువాను పగలగొట్టి 24 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.1.20 లక్షల నగదును దొంగలించారు. అక్కడే వెండి ఆభరణాలు ఉన్నప్పటికీ వాటిని దొంగలు ముట్టుకోలేదు. దీంతో పలు అనుమానాలకు తావిస్తోందని పోలీసులు భావిస్తున్నారు. కింది ఇంట్లో దొంగలించిన తర్వాత దుండగులు అదే ఇంట్లోనిపై అంతస్తులో నివాసముంటున్న రామచంద్రగౌడ్ ఇంట్లో కూడా దొంగలు చోరీకి యత్నించారు. ఈ ప్రయత్నంలో ఐదు గ్రాముల బంగారం చోరీ జరిగినట్లు రామచంద్రగౌడ్ తెలిపారు. టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ దొంగతనంపై వివరాలు సేకరించేందుకు కర్నూలు నుంచి క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. వారి ఇంట్లో వేలిముద్రలను సేకరించి, దొంగల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

పోలీసుల దర్యాప్తు వేగవంతం

(5వ పేజీ తరువాయి)

అంతలో బైక్ తీసేందుకు ప్రయత్నించగా.. రెండు, మూడు బస్సులు అటువైపుగా వెళ్లాయి. ఇంకోసారి బైక్ తీసే ప్రయత్నంలో ఉండగా.. వేమూరి ట్రావెల్స్ బస్సు వచ్చి ఈ బైక్‌ను ఢీకొట్టి తోసుకుంటూ వెళ్లిపోయింది. ఇలా తోసుకుంటూ వెళ్లడమే ప్రమాదానికి కారణమని పోలీసులు గుర్తించారు. ఈ సమయంలో అటువైపుగా వెళ్లిన రెండు ఆర్టీసీ, ఒక ట్రావెల్ బస్సులను రిజిస్ట్రేషన్ల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఆ బస్సు డ్రైవర్లను ఆదివారం కర్నూలుకు పిలిపించి పోలీసులు స్టేట్‌మెంట్లు తీసుకోనున్నారు.

బాధితులకు మెరుగైన సేవలు

- ఆర్ఐసీయూలో ప్రయాణికుడు గుణసాయికి చికిత్స
- 11 మంది జీజీహెచ్ నుంచి డిశ్చార్జ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు సమీపంలో బస్సు దగ్ధం సంఘటనలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వైద్యులను ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన కర్నూలు జీజీహెచ్‌లోని క్యాజువాల్టీ, ఏఎంసీ అత్యవసర విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న బస్సు ప్రమాద బాధితుడు తూర్పుగోదావరిజిల్లాకు చెందిన గుణసాయి కుమార్ (27) ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐసీయులో చికిత్స పొందుతున్న బాదితుని బీపీ, పల్స్‌రేట్ ఆక్సిజన్ శాతం ఎలా ఉందో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి 3 గంటలకు ఒక్కసారి రోగి బీపీ, పల్స్ ఆక్సిజన్ శాచులేషన్‌ను నివేదిక పంపించాలని పల్మనాలజీ జనరల్ మెడిసిన్, అనస్థీషియా డ్యూటీ డాక్టర్లను ఆదేశించారు. బస్సు ప్రమాదంలో గాయపడి 12 మంది హాస్పిటల్‌కు వచ్చి చికిత్స తీసుకుని 11 మంది డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు.

ఎర్రిస్వామికి చికిత్స

కర్నూలు బస్సు ప్రమాదం బైకిస్టు శివశంకర్ మిత్రుడు ఎర్రిస్వామిని చికిత్స కోసం పోలీసులు కర్నూలు జీజీహెచ్‌కు శనివారం రాత్రి తీసుకుని వచ్చారు. ఎర్రిస్వామికి కడుపు నొప్పి ఉండటంతో అతనికి స్కానింగ్, ఇతర పరీక్షలు చేయించారు. తక్షణమే ఎర్రిస్వామిని సర్జరీ వార్డులో అడ్మిట్ చేసి చికిత్స అందించాలని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వైద్యులను ఆదేశించారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డా.ఏ. సిరి తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

- అర్జీల పరిష్కారానికి 1100కు ఫోన్ చేయవచ్చు.

అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meeko-sa-m.a-p.-go-v.in వెబ్‌సైట్‌లో వారీ అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

మెడికల్ పీజీ విద్యార్థిని ఆత్మహత్య

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటాద్రి నగర్‌లో భూమిరెడ్డి గిరిజ (26) అనే యువతి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భూమిరెడ్డి గిరిజ కర్నూలులో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని కర్ణాటకలో పీజీ చదువుతోంది. శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ఆమె తన ఇంట్లోని గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రఘునాథరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పెద్దవంక వాగులో ఆటో బోల్తా

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్ల గ్రామానికి సమీపంలోని పెద్దవంక వాగులో ఆటో బోల్తా పడింది. శనివా రం పర్లకు చెందిన ఆటో డ్రైవర్ మద్దిలేటి రామదాసు కర్నూలుకు బయలు దేరాడు. ఆటో పెద్దవంక వాగు బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి బోల్తాపడింది. ఆటోలో ప్యాసింజర్లు లేకపోవడం, వాగులో నీరు ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

రైతులకు శనగ విత్తనాలు అందజేత

పగిడ్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీ కింద మంజూరు చేసిన శనగ విత్తనాలను శనివారం రైతులకు అందజేసినట్లు వ్యవసాయాధికారి మురళీధర్ తెలిపారు. మండలానికి జేజీ -11 రకం శనగ విత్తనాలు వంద క్వింటాళ్లు మంజూరైనట్లు తెలిపారు. పగిడ్యాల గ్రామానికి 50 క్వింటాళ్లు, ముచ్చుమర్రికి 35 క్వింటాళ్లు, లక్ష్మాపురం గ్రామానికి 15 క్వింటాళ్లు ప్రకారం కేటాయించామన్నారు. క్వింటా శనగ విత్తనాల ధర రూ. 7800 కాగా, 25 శాతం సబ్సిడీ పోను రైతులు రూ. 5850 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతు సేవ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను దుర్భాషలాడుతున్న జీఎఫ్‌సీ అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగార్జున కోరారు. శనివారం ఇంటర్మీడియట్ విద్య ఆర్‌జేడీ సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు నాయకులు సురేష్, దినేష్ తదితరులున్నారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలి

ఆత్మకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోగాలు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు రాజశేఖర్, రణధీర్, సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని రోడ్లపై ఉన్న చెత్తకుప్పలను పరిశీలించారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఇస్మాయిల్, వీరన్న తదితరులున్నారు.

నిర్లక్ష్యం తగదు

నందికొట్కూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం తగదని సీపీఐ నాయకులు రఘురామమ్మూర్తి, శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని ఏడీఏ గిరీష్‌కు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు మౌలాలి, బోయ శ్రీనివాసులు, అన్వర్ బాషా, మహానంది, కమల్ పాల్గొన్నారు. అలాగే సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని ఏడీఏ గిరీష్‌కు వినతి పత్రం సమర్పించారు. నాయకులు మేకల శేఖర్, స్వామన్న, నరసింహులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు రూరల్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కేడీసీసీ సింగిల్ విండో చైర్మన్ ఏ. షహబుద్దీన్ కోరారు. శనివారం మండలంలోని బాపనంతాపురం గ్రామంలో మొక్కజొన్నలు ఆరబోసుకున్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు శ్రీను అన్సర్ అలీ, ఖాదర్ వలి, జబివుల్లా, రహంతుల్లా, పుల్లమ్మ, రబ్బానిలు పాల్గొన్నారు.

'అపార్'ను వేగవంతం చేయాలి

గడివేముల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అపార్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండలంలోని గని, మంచాలకట్ట గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేశారు. పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

నంద్యాల రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు వరమని సీఎంఆర్ఎఫ్ అని టీడీపీ రాష్ట్ర నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో 36 మందికి రూ.20 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు మునియార్ ఖలీల్, తులసీశ్వర్‌రెడ్డి, కామిని మల్లికార్జున, అయ్యలూరు త్రిలింగేశ్వర్‌రెడ్డి, ఉప్పరి సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని కానాలపల్లె గ్రామానికి చెందిన ఇద్దరు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి , టి.చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందరెడ్డి, ఉసేన్‌సా పాల్గొన్నారు.

బయో వ్యర్థాల నిర్వహణలో..
నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ రాజకుమారి
- పోస్టర్ ఆవిష్కరణ

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో కాలుష్య నియంత్రణ చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. రోగులు, సిబ్బంది, ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా వైద్య వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతిలో నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రులలో కాలం చెల్లిన మందులను సక్రమంగా ధ్వంసం చేయాలన్నారు. అలాంటి మందులను సాధారణ చెత్తతో కలిపి పారబోస్తే పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. రెడ్, ఎల్లో, బ్లూ, వైట్ రంగుల బయో కోడింగ్ బ్యాగులు ఉపయోగించి ఇంజక్షన్ సూదులు, పత్తి, గ్లౌజ్స్ శరీర వ్యర్థాలు తదితర బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేయాలన్నారు. అలాగే ప్రతి ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్ తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాల వివరాలను బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యాప్‌లో ప్రతిరోజూ ఎంట్రీ చేయాలన్నారు. డేటా ఎంట్రీ చేయని సంస్థలపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోవాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్ష అనంతరం కలెక్టర్ 'చెత్తను వేరు చేసే ముందు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఆలోచించండి' అనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ లలిత, పంచాయతీ రాజ్, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి: జేసీ

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మొక్కజొన్న అమ్ముకునేందుకు రైతు సేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై జిల్లా వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్-2025లో దాదాపు 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, దీంతో దాదాపు 50 వేల టన్నుల మొక్కజొన్న ఉత్పత్తులు వస్తాయన్నారు. ప్రభుత్వం నుంచి మొక్కజొన్నల కొనుగోలు ఉత్తర్వులు రాగానే కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రైతు సేవాకేంద్రాల వద్దనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో వర్ష సూచన ఉందని మొక్కజొన్న కోతలు ఆపుకొనేలా రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోలుకు సంబంధించి సంచులు, 25000 టన్నుల గోదాములు అందుబాటులో ఉన్నాయని మార్క్‌ఫెడ్ అధికారి తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ, జిల్లా మార్కెటింగ్, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

జిన్నింగ్ మిల్లులో గిట్టుబాటు ధరకు పత్తిని అమ్ముకోవాలి

జిల్లాలోని రైతులందరూ తాము పండించిన పత్తిని పట్టణంలో ఏర్పాటు చేసిన జిన్నింగుమిల్లులో గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ తెలిపారు. తన చాంబర్‌లో జిల్లాస్థాయి పత్తి కొనుగోలు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి కనీస మద్దతు ధర రూ.7710 (పొట్టి పింజ రకం), రూ.8110 (పొడవు పింజరకం) కంటే తక్కువ ఉన్నందున పట్టణంలోని శ్రీమురారి పవన్ ఆగ్రోటెక్ జిన్నింగు మిల్లులో కాటన్ కార్పొరేషన్ వారు పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. పత్తిరైతులు పత్తిని జిన్నింగుమిల్లునకు తీసుకువచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రెహ్మాన్, జిల్లా స్థాయి అధికారులు, జిన్నింగ్ మిల్లు ప్రతినిధులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

నందికొట్కూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మార్కెట్ యార్డులో నియోజకవర్గంలోని అన్ని సంక్షేమ హాస్టళ్ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. త్వరలో హాస్టళ్లను తనిఖీ చేస్తానన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. సమావేశంలో నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్ల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

బాధితులకు అండగా సీఎం సహాయ నిధి

అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని బాధితులకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పట్టణానికి చెందిన తొమ్మిది మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరు అయిన రూ.7,10,836 చెక్కులను శనివారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, సొసైటీ చైర్మన్ ముర్తుజావలి, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిలేటి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

పాణ్యం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసినట్లు హెచ్ఎం రాములు నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ దినేష్ బాబు, ఇమామ్‌బాషా, విజయకుమార్, సుబ్బారెడ్డి, సీఆర్పీలు శివప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం అనే అంశంపై శనివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభచూపిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఈవోలు తెలిపారు.

శ్రీశైలంలో కార్తీక పూజలు


శ్రీశైలంలో నాగప్రతిమలకు అభిషేకం చేస్తున్న భక్తులు


మహానందిలో భక్తుల రద్దీ

శ్రీశైలం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో కార్తీక శుద్ధ చవితి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆలయ ప్రాంగణలోని నాగుల కట్ట వద్ద గల పురాతన నాగ ప్రతిమలకు భక్తులు పూజలు చేశారు. అదే విధంగా ఆలయ తూర్పు ప్రాకారకుడ్యంపై కొలువుదీరిన నాగశిల్పాలలో ఆదిశేషుడు, నాగబంధ శిల్పాలను కూడా భక్తులు దర్శించుకున్నారు.

భక్తుల సందడి

కార్తీక మాసం ప్రారంభమైన తొలి శనివారం క్షేత్ర పురవీధులు భక్తులతో కిటకిటలాడాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల యాత్రికులతోపాటు ఉత్తర దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులు కృష్ణానది పుణ్యస్నానాలు చేసుకుని పసుపుకుంకుమ గాజులను గంగమ్మకు సారెగా సమర్పించుకున్నారు. అందరికీ అలంకార దర్శనాలు మాత్రమే కల్పిస్తుండగా ఉభయ దేవాలయాలు దర్శించుకునేందుకు సుమారు నాలుగు గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు. కార్తీక మాసంలో మల్లన్న దర్శనాలనికి వచ్చే యాత్రికులు ఆలయ సిబ్బంది, శివసేవకులతో సహకరిస్తూ దర్శనాలు చేసుకోవాలని ఈవో కోరారు.

పరమ శివుని దర్శనం కోసం..

మహానంది: మహానంది క్షేత్రం శనివారం కార్తీక మాసం భక్తుల రద్దీతో నిండిపోయింది. పరమ శివుని దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. మరో రెండు రోజులపాటు క్షేత్రంలో భక్తుల రద్దీ ఉండే అవకాశం ఉంది.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది క్షేత్రంలో శనివారం రాత్రి నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసం పురస్కరించుకొని క్షేత్రానికి చేరుకున్న ఎస్పీ దంపతులకు ఆలయం ముఖద్వారం వద్ద ఆలయ పర్యవేక్షకుడు సుబ్బారెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చన చేశారు. కల్యాణమంటపంలో ఎస్పీ దంపతులను వేదపండితులు ఆశీర్వదించారు. జ్ఞాపికను అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగులకట్ట వద్ద కార్తీకదీపాలను వెలిగించారు.


ఎస్పీ దంపతులకు జ్ఞాపికను అందించిన అర్చకులు

పోలీసు సిబ్బందికి వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

నంద్యాల టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా నంద్యాల జిల్లా బొమ్మలసత్రం సమీపంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి ప్రస్తుత కాలంలో పోలీస్ వ్యవస్థలో సాంకేతికత పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నంద్యాల సబ్ డివిజన్ నుంచి 27 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారన్నారు. సాయుధ బలగాల డీఎస్పీ శ్రీనివాసరావు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, టీచర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, సుందర్‌రావు, కె.వి. సుబ్బారెడ్డి, జి.నాగేంద్రకుమార్ పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు.


పరీక్ష రాస్తున్న పోలీసు సిబ్బంది

కాసుల కక్కుర్తి..!

(5వ పేజీ తరువాయి)

చాలా బస్సుల్లో డ్రైవర్లు అతివేగం.. ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి, నిద్రమత్తుతో డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారు.

బస్సుల్లో భద్రత ఏదీ?

ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు ప్రయాణికుల భద్రతపై కనికరం చూపించడం లేదు. ఆయా బస్సుల్లో ప్రధానంగా ఎగ్జిట్ డోర్.. విండో తప్పనిసరిగా ఉండాలి. 2024 నవంబరు నెల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి బస్సులోనూ అగ్నిమాపక పరికరాలు ఉండాలి. ఇవన్నీ చాలా వరకు బస్సుల్లో లేవు. కొన్ని స్లీపర్ బస్సుల్లో అయితే మరీ దారుణం. గుడ్డలతో కప్పేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా పలు ట్రావెల్స్ కొనసాగిస్తుండటం విస్మయం కలిగిస్తోంది.

సౌకర్యంగా ఉంటుందనే భావనతో..

ప్రైవేటు ట్రావెల్స్ అయితే వేగం.. సౌకర్య వంతంగా ఉంటుందనే భావనతో చాలా మంది ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. ట్రావెల్స్ నిర్వాహకులు ఇదే అదునుగా భావించి కనీస నిబంధనలు కూడా పాటించకుండా నిర్వహణ సాగిస్తున్నారు. దీనికి నిదర్శనం కర్నూలు జిల్లాలో జరిగిన ఘటన. చాలా వరకు బస్సుల్లో భద్రతతో పాటు ఫిట్‌నెస్, బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్స్, పర్మిట్‌లు, డ్రైవర్లకు లైసెన్సులు కూడా ఉండటం లేదని తెలుస్తోంది. ఈ వ్యవహారం ఇంతలా జరుగుతున్నా రవాణా శాఖ అధికారులు మాత్రం ఆశించిన స్థాయిలో తనిఖీలు చేయడం లేదు. నిత్యం తనిఖీలు చేస్తే ప్రైవేట్ ట్రావెల్స్ దందాకు ఫుల్‌స్టాప్ పడే అవకాశముంది.

మామూళ్ల మత్తులో....

ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకుల నుంచి కొందరు అధికారులకు నెలవారీ మామూళ్లు ముడుతున్నాయనే తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అడపాదడపా తనిఖీలు చేసి మమ అనిపించేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దందా సాగించే ట్రావెల్స్ నిర్వాహకులపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తనిఖీలు ముమ్మరం చేశాం



ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులపై తనిఖీలు ముమ్మరం చేశాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నాం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 103 కేసులు నమోదు చేసి రూ.6.75 లక్షలు జరిమానా విధించాం. తాజాగా ఓ బస్సు ఎఫ్‌సీ రద్దు చేశాం.

- శివారెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి, నంద్యాల

భక్తులకు మెరుగైన సేవలు

మహానంది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతి, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకుడు వసుపుల సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆలయ పరిసరాల్లో భక్తుల వసతి, ఉచిత దైవదర్శనంతో పాటు పలు మార్గాలను తెలిపే సూచికల ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయించారు. భక్తులకు క్షేత్రంలో ఎలాంటి ఆటంకాలు కల్గకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యంపై నివేదికలు పంపుతాం

మహానంది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల మండలంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న ధాన్యం తడిసి మొలకలు వచ్చిందని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం మహానంది నుంచి గాజులపల్లికి వెళ్లే మార్గంలో రైతులు ఆరపెట్టుకొన్న మొక్కజొన్న పంటను ఏవో పరిశీలించారు. పంట నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మహానంది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి భగవాన్‌దాస్ తెలిపారు. శనివారం మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు తిమ్మాపురం పీహెచ్‌సీ డాక్టర్ భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో ఉసేన్‌రెడ్డి, సిబ్బంది, ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.

పొంగిన వాగులు

పాములపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భవనాశి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రహదారిలో రాక పోకలు నిలిచిపోయాయి. రైతులు, గ్రామస్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కోటి సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న వైసీపీ నాయకులు

నంద్యాల రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నంద్యాలలో వైసీపీ లీగల్ సెల్ న్యాయవాదుల ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రక్రియను శనివారం ప్రారంభించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో వైసీపీ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, వివేకానందరెడ్డి, రామాంజనేయులు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి గ్రామాల్లో వైసీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం కోటి సంతకల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పగిడ్యాల సర్పంచ్ శేషన్న, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వచ్చేనెల 23 నుంచి నవచండీ యాగం

కొత్తపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రంలో నవంబరు 23నుంచి 26వరకు నవచండీ సహిత రుద్రయాగం నిర్వహిస్తున్నట్లు అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమ పీఠాధిపతి శివానందలహరి స్వామిజీ శిష్యుడు నాగేంద్ర స్వామిజీ తెలిపారు. శనివారం అల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను కలిసి ఆహ్వానించారు. పోస్టర్‌ను విడుదల చేశారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, స్వామీజీ శిష్య బృందం పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన

నంద్యాల కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్‌ను వినియోగించుకోవాలని ఏఈ రమేష్ కుమార్ సూచించారు. శనివారం పట్టణం లోని వివేకానంద ఆడిటోరియంలో పొదుపు మహిళలకు పీఎం సూర్య ఘర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీ వెంకటదాస్, రామకృష్ణా డిగ్రీ కళాశాల నిర్వాహకుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మొక్కజొన్న రైతులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



మాట్లాడుతున్న అఖిలప్రియ

ఆళ్లగడ్డ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు తడిసిపోయిన మొక్కజొన్న పంటను మార్కుఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను న్యాయం చేస్తామని అన్నారు. భారీ వర్షాలకు మొక్కజొన్న పంట తడిచిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వారు సానుకులంగా స్పందించారని అన్నారు.

వీడని వాన

● పొంగి ప్రవహిస్తున్న వాగులు
● తడిచిన పంట దిగుబడులు

ఆళ్లగడ్డ/ రుద్రవరం/ దొర్నిపాడు/ సంజామల, డోన్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రుద్రవరం మండలం వెలగల పల్లెలో వరి పంట నేలవాలింది. నరసాపురంలో రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న తడిచిపోయాయి. దొర్నిపాడు ఎస్సీ కాలనీలో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో సామగ్రి తడిచి ముద్దయ్యాయి. అలాగే పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. సంజామలలో పాలేరు వాగు పొంగి ప్రవహించింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. ఆళ్లగడ్డ మండలంలోని కోట కందుకూరు గ్రామ సమీపంలో వక్కిలేరు, ఎగువ అహోబిలంలో భవనాశి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆర్ కిష్టాపురం, బాచేపల్లె, తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏరుదాటే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ సిబ్బందిని అప్రమత్తం చేసి నీటి ప్రవాహం తగ్గేంత వరకు ఈ రూట్‌లో వాహనాలు ప్రయాణించకుండా ప్రజలను అప్రమత్తం చేశారు. సంజామల మండలంలో పాలేరు, గోంగ్ర, కప్పల వాగులు ఉధృతి తగ్గలేదు. డోన్ మండలంలో శనివారం ఉదయం, రాత్రి కురిసిన వర్షం నీరు రోడ్డు మీద ప్రవహించడంతో దాదాపు 2 గంటల సేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



ఎగువ అహోబిలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి



నరసాపురంలో తడిసిన మొక్కజొన్నను ట్రాక్టరులో నింపుతున్న రైతులు

కాసుల కక్కుర్తి..!

(5వ పేజీ తరువాయి)

చాలా బస్సుల్లో డ్రైవర్లు అతివేగం.. ర్యాష్ డ్రైవింగ్, మద్యం తాగి, నిద్ర మత్తుతో డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారు.

బస్సుల్లో భద్రత ఏదీ?

ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు ప్రయాణికుల భద్రతపై కనికరం చూపించడం లేదు. ఆయా బస్సుల్లో ఎగ్జిట్ డోర్.. విండో తప్పనిసరిగా ఉండాలి. 2024 నవంబరు నెల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి బస్సులోనూ అగ్నిమాపక పరికరాలు ఉండాలి. ఇవన్నీ చాలా వరకు బస్సుల్లో లేవు. కొన్ని స్లీపర్ బస్సుల్లో అయితే మరీ దారుణం. గుడ్డలతో కప్పేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా పలు ట్రావెల్స్ కొనసాగిస్తుండటం విస్మయం కలిగిస్తోంది.

సౌకర్యంగా ఉంటుందనే భావనతో..

ప్రైవేటు ట్రావెల్స్ అయితే వేగం.. సౌకర్య వంతంగా ఉంటుందనే భావనతో చాలా మంది ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. ట్రావెల్స్ నిర్వాహకులు ఇదే అదునుగా భావించి కనీస నిబంధనలు కూడా పాటించకుండా నిర్వహణ సాగిస్తున్నాయి. దీనికి నిదర్శనం కర్నూలు జిల్లాలో జరిగిన ఘటన. చాలా వరకు బస్సుల్లో భద్రతతో పాటు ఫిట్ నెస్, బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్స్, పర్మిట్‌లు, డ్రైవర్లకు లైసెన్సులు కూడా ఉండటం లేదని తెలుస్తోంది. నిత్యం తనిఖీలు చేస్తే ప్రైవేట్ ట్రావెల్స్ దందాకు ఫుల్‌స్టాప్ పడే అవకాశముంది.

తనిఖీలు ముమ్మరం చేశాం

ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులపై తనిఖీలు ముమ్మరం చేశాం. నిబం ధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేసి జరి మానాలు విధిస్తున్నాం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 103 కేసులు నమోదు చేసి రూ.6.75 లక్షలు జరిమానా విధించాం. తాజాగా ఓ బస్సు ఎఫ్‌సీ రద్దు చేశాం.

● శివారెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి, నంద్యాల

పథకాలను ప్రజలకు వర్తింపజేయాలి: ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్

బేతంచెర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలకు వర్తింపజేయాలని ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్ అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని రెండు నిమిషాల పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు మౌనం పాటించాలి. అనంతరం ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి విజయకుమార్, విద్యుత్, పంచాయతీరాజ్ ఏఈలు శ్రీనివాసులు, మహేష్, ఎంఈవో సోమశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ మారుతి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాద్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు శివలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పమ్మ, ఏపీవో విజయరాణి, ఎంపీటీసీలు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

డోన్ టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో టీడీపీ నేతలతో కలిసి సమావేశం నిర్వహించి, ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.29 లక్షల చెక్కును బాధితులకు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామ కృష్ణ, పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు, మహ్మ ద్ రఫీ, అబిరెడ్డి పల్లె గోవిందు, ఆలేబాదు పరమేష్ పాల్గొన్నారు.

వైద్యుల సమ్మె విరమణ

కొలిమిగుండ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గత నెల రోజులుగా సమ్మె చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మెను విరమించారు. ప్రభుత్వం వైద్యులతో జరిపిన చర్చలు సఫలం కావడంతో శనివారం పీహెచ్‌సీల్లో వారు విధులకు హాజరయ్యారు. కొలిమి గుండ్లలో డాక్టర్లు హరిచరణ్‌రెడ్డి, నాగజ్యోతి, అంకిరెడ్డిపల్లెలో డాక్టర్ నాగార్జున విధుల్లో చేరి రోగులకు సేవలందించారు. గత నెల రోజులుగా పీహెచ్‌సీల్లో నిలిచిపోయిన వైద్య సేవలు తిరిగి ప్రారంభం కావడంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డోన్ రూరల్: గత నెల రోజులుగా సమ్మె చేస్తున్న ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేస్తున్న సమ్మెను విరమించి శనివారం విధుల్లో చేరారు. మండలంలోని కొత్తకోట గ్రా మంలో 104 వాహనాల ద్వారా వైద్యసేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీకాంత్, విలేజ్ క్లీనిక్ పీహెచ్‌వో ఉమాదేవి, సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, 104 వాహన డ్రైవర్ తిప్పన్న, డీవో వెంకటేశ్ విధులకు హాజరయ్యారు.

చాగలమర్రి: గత నెల రోజులుగా సమ్మె చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేస్తున్న సమ్మెను విరమించి శనివారం విధుల్లో చేరారు. చాగలమర్రిలోని 24 గంటల ప్రభుత్వ వైద్య శాలలో వైద్యులు అంజలి విధుల్లో చేరి రోగులకు వై ద్య సేవలు అందించారు.

మౌలిక వసతులు కల్పించాలి

చాగలమర్రి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పీ-4 కింద గుర్తించిన బంగారు కుటుంబాల వారికి మౌలిక వసతులు కల్పించాలని ఆళ్లగడ్డ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కిషోర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో బంగారు కుటుంబాల దత్తత తీసుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బంగారు కుటుంబాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాహిర్‌హుసేన్ మార్గదర్శ కులు, అన్సర్‌బాషా, కొలిమి ఉసేన్‌వలి, మౌలాలి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతులకు నివాళి

బనగానపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద మృతి చెందిన 19 మందికి సంఘీభావంగా బనగానపల్లెలో శనివారం రాత్రి ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆస్థానం నుంచి పెట్రోల్ బంకు కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కర్నూలు జిల్లాలో ఇలాంటి దుర్ఘటనలు జరగడం దారుణమన్నారు. సభ్యులు షాషావలి, సాయిరాం, రామకృష్ణ, నస్రుద్దీన్ పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సులపై అధికారుల తనిఖీ

ఆళ్లగడ్డ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అహోబిలం రోడ్డులో శనివారం నంద్యాల ప్రాంతీయ రవాణా శాఖ అధికారి రవిశంకర్ నాయక్ ఆధ్వర్యంలో ప్రైవేటు బస్సులపై తనిఖీలు నిర్వహించారు. పట్టణ పోలీసులతో కలిసి బస్సు డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి, లైసెన్స్‌లు లేని వారిపై కేసులు నమోదు చేశారు. ఎవరైన మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని రవాణా శాఖాధికారి రవిశంకర్ నాయక్ హెచ్చరించారు.

మద్దిలేటి స్వామి సన్నిధిలో ఎంపీ దంపతులు

బేతంచెర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు దంపతులు శనివారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను పూజలు చేశారు. ఆలయ ఈవో రామాంజనేయులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంపీ దంపతులను శాలువతో సన్మానించి స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

రుద్రవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో భాగ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు అప్‌డేట్ చేయాలన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

చాగలమర్రి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఆళ్లగడ్డ ఉద్యానశాఖ అధికారి దస్తగిరి అన్నారు. 'ఉల్లి ధర పతనం.. గొర్రెలకు వదిలేసిన పొలాలు' అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఆయన శనివారం మండలంలోని చింతలచెరువు గ్రామంలో వర్షపు నీటిలో నిలిచిన ఉల్లిపంటను పరిశీలించారు.

వ్యక్తిపై దాడి

ప్యాపిలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలేబాదు గ్రామంలో శనివారం రస్తా తగాద విషయంలో పాండురంగడు వ్యక్తిపై దాడి జరిగింది. ఈ దాడిలో పాండురంగడుకు తీవ్ర గాయలు కావడంతో కర్నూలుకు తరలిం చారు. అలేబాదు చెందిన పాండురంగడు, శేఖర్ పొలాలు పక్క పక్కనే ఉన్నాయి. ఇద్దరి మధ్య పొలం రస్తా తగాద రెండేళ్లుగా జరుగుతుంది. తరచూ ఇరువురి గొడవలకు పాల్పడేవారు. ఈ నేపథ్యంలో పాండురంగడు పొలానికి వెళ్లుతుండగా మార్గమధ్యలో శేఖర్ కాపుకాసి పట్టుడు కట్టెతో దాడి చేశాడు. ఈ దాడిలో పాండురంగడు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండ టంతో కర్నూలుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాచెర్ల పోలీసులు తెలిపారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

డోన్ టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలకు మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేంద్ర, మున్సిపల్ డీఈ, ఏఈలు రఘు, సురేష్ పాల్గొన్నారు.